News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :58 | ఖమ్మం | బుధవారం, ఏప్రిల్ 16, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



# మంత్రి పదవులపై మాట్లాడొద్దు!

## బయట కామెంట్లు చేయొద్దు

- పార్టీ గీత దాటితే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని స్పష్టీకరణ
- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని హితవు
- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అన్న ముఖ్యమంత్రి

**సొంత పార్టీ ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి హెచ్చరిక**

తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యే లకు హెచ్చరిక జారీ చేశారు. పార్టీ గీత దాటితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. శంషాబాద్ నోవా టెల్ హెూటల్‌లో జరుగుతున్న కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీకి ఇబ్బంది కలిగించాలని ఎవరైనా చూస్తే వారే ఇబ్బంది పడతారని అన్నారు. పార్టీకి వ్యతిరే కంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని గుర్తించాలని హితవు పలికా రు.

వివరాలు 2లో..

## ఏటా 60 లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి అవకాశం

- ఫిలిప్పీన్స్‌కు 10 లక్షల టన్నులు..
- ఉత్పత్తి, ఎగుమతులకు ప్రోత్సాహం
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రం నుంచి ఏటా 60 లక్షల టన్నుల వరకు బియ్యం ఎగుమతి కి అవకాశం ఉందని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజల అవసరాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా, కేంద్ర నిల్వలన్నింటికీ కలిపి వినియోగించే దొడ్డు, సన్న బియ్యం పోనూ రాష్ట్రంలో భారీగా మిగులు నిల్వలు ఉంటాయన్నారు. ఫిలిప్పీన్స్‌కు దొడ్డు బియ్యం ఎగుమతి ప్రారంభించామని.. ఏడాదికి 10 లక్షల టన్నులు పంపేందుకు వీలుందన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'బియ్యం ఎగుమతి విధానం' అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

వివరాలు 2లో..

## మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాలు

కాళేశ్వరంలో 17 అడుగుల సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ: మంత్రి సురేఖ




తెలంగాణలో సరస్వతి నది పుష్కరాలు మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని భక్తులకు అందించేందుకు వెబ్ పోర్టల్, యాప్‌ను

వివరాలు 2లో..

## జ్వరంతో కేబినెట్ సమావేశానికి పవన్ దూరం

సచివాలయానికి వచ్చినా అస్వస్థతతో తిరిగి క్యాంప్ ఆఫీసుకు..



మంత్రి మండలి సమావేశానికి హాజరయ్యేందుకు సచివాలయానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆరోగ్య సమస్య ఇబ్బంది పెట్టడంతో సమావేశం ప్రారంభం కాకముందే వెనుదిరిగి వెళ్లారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం

వివరాలు 2లో..

## క్రమబద్ధీకరణ విధానంతో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం

- హైకోర్టు వ్యాఖ్య
- మణికొండ జాగీరు నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీకి ఆదేశం
- లేదంటే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టీకరణ




హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో అనుమతులు లేని, అనుమతులను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ప్రభుత్వం, జీహెచ్ఎంసీలు అమలు చేస్తున్న క్రమబద్ధీకరణ విధానం అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్నట్లుందని హైకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీరులోని సర్వే నం.203/1/3/1, 204 నుంచి 209, 210/1/3లలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ మణినగర్ ప్లాట్

వివరాలు 2లో..

## జీసీసీలకు హబ్‌గా హైదరాబాద్

- 2030 నాటికి 20 కోట్ల చ.అ. కమర్షియల్ స్పేస్ అందుబాటులోకి తెస్తాం
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ నగరాన్ని జీసీసీలకు హబ్‌గా మార్చడం.. 2030 నాటికి 20 కోట్ల చదరపు అడుగుల గ్రేడ్-ఏ కమర్షియల్ స్పేస్ (కార్యాలయాల అద్దె స్థలం) అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కోకాపేట జీఏఆర్ ఇన్ఫోబాన్ ఐటీ భవనంలో అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ)ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'హైదరాబాద్ నగరం ప్రపంచ వ్యాపార హబ్‌గా మారింది.

వివరాలు 2లో..


## పవన్ 'కన్వర్టెడ్ సనాతని'



- పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నేత పేర్ని నాని విమర్శలు
- పవన్ కళ్యాణ్ 'కన్వర్టెడ్ సనాతని' అంటూ వ్యాఖ్య
- ఎన్నికల ముందు అన్ని మతాలు సమానమని చెప్పి, గెలిచాక మారారని ఆరోపణ
- కాషాయ వస్త్రాలు ధరించి సనాతన ధర్మ పరిరక్షకుడిగా ప్రకటించుకున్నారని ఎద్దేవా
- పవన్ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించారని, ఇక ప్రశ్నించేదేమీ లేదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే అధిక వర్షపాతం



- నైరుతి రుతుపవనాల సీజన్ పై ఐఎండీ అంచనాలు
- దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెంమీ
- ఈ ఏడాది 105 శాతం వర్షపాతం నమోదవుతుందన్న ఐఎండీ

వివరాలు 2లో..

## కులగణన, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలు

వీటి ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సీఎల్పీ సమావేశంలో భట్టి



సంక్షేమ పథకాలతోపాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలని, వాటి ఫలితాలను కాంగ్రెస్ నేతలు, శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో జరిగిన

వివరాలు 2లో..

## విశాఖ నుంచి అమరావతికి హైదరాబాద్ మీదుగా రావాలా?

- విశాఖ-విజయవాడ మధ్య నడిచే మార్నింగ్ ఫ్లయిట్స్ రద్దు
- దాంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్న గంటా
- అమరావతి చేరుకోవడానికి రెండు విమానాలు మారాల్సి వచ్చిందని ఆవేదన



విశాఖ-విజయవాడ నగరాల మధ్య ఉదయం నడిచే రెండు విమాన సర్వీసులు రద్దు చేయడం వల్ల తీవ్ర అసౌకర్యం కలుగుతోందని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తనకు, ఇతర ప్రయాణికులకు ఎదురైన అనుభవాలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆంధ్రాలో ఒక ప్రాంతం నుంచి

వివరాలు 2లో..

## ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మార్కులు రావనే అపోహను మీరు చెరిపేశారు



- ఇటీవల ఇంటర్ రిజల్ట్స్ విడుదల
- ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు
- ఉండవల్లి నివాసంలో షైనింగ్ స్టార్స్-2025 కార్యక్రమం
- 52 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ల్యాప్ టాప్స్ బహూకరించిన లోకేశ్

వివరాలు 2లో..

# క్రమబద్ధీకరణ విధానంతో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం

- మొదటి పేజి తరువాయి

మెంబర్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ సొసైటీ, ఎస్.గోపాల్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు.. మణికొండ జాగీరులో యథాతథ స్థితి కొనసాగించాలని, నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలను సమర్పించాలంటూ 2023 మార్చి 14న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఎస్.గోపాల్.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వి.ఎస్.ఆర్.ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ పలు అక్రమ నిర్మాణాలు వెలిశాయన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో జీహెచ్ఎంసీ విఫలమైందన్నారు. అధికారులతో కుమ్మక్కైన నిర్మాణదారులు అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టారన్నారు. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది జి.మధుసూదన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అక్రమ నిర్మాణాలను సీజ్ చేశామని, చట్టప్రకారం నిర్మాణాలను నిలిపివేయడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌తోపాటు కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో జతచేసిన ఫొటోలను పరిశీలిస్తే అక్రమ, అనధికారిక నిర్మాణాలను ఇప్పటికే మొదలుపెట్టినట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రాథమికంగా చూస్తే.. యథాతథ స్థితి కొనసాగించాలంటూ 2023 మార్చి 14న ఇదే హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను చిత్తశుద్ధితో అమలు చేయలేదని తెలుస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు, తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పలు తీర్పులు వెలువరించిందన్నారు. మణికొండ జాగీరులో మొత్తం ఎన్ని నిర్మాణాలున్నాయి, ఎన్నింటికి అనుమతులు ఇచ్చారు, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాల వివరాలు ఇవ్వాలని జీహెచ్ఎంసీని ఆదేశించారు. అనుమతులను ఉల్లంఘించి చేపట్టిన, అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలుబీ వాటికి విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయాలంటూ ఏవైనా లేఖలు రాశారా.. ఒకవేళ రాస్తే వాటి వివరాలుబీ అక్రమ నిర్మాణాలపై ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులపై తీసుకున్న చర్యలపై జులై 2లోగా నివేదిక సమర్పించాలన్నారు. ఒకవేళ నివేదిక సమర్పించడంలో విఫలమైతే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవాల్సి ఉంటుందని పేర్కొంటూ విచారణను జులై 2కు వాయిదా వేశారు.

# ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే అధిక వర్షపాతం

దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఊరటనిచ్చే వార్తను అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈ మేరకు తన దీర్ఘకాలిక అంచనా వివరాలను వెల్లడించింది. దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ) 87 సెంటీమీటర్లతో పోలిస్తే, ఈసారి 105 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ అంచనాలో ఐదు శాతం హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే ఈ రుతుపవనాల సీజన్‌కు సంబంధించిన వివరాలను భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ ఈరోజు ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సాధారణంగా 105 శాతం నుంచి 110 శాతం మధ్య వర్షపాతాన్ని 'సాధారణం కంటే ఎక్కువ' గా ఐఎండీ వర్గీకరిస్తుంది. అనుకూల వాతావరణ పరిస్థితులు ఈ అంచనాకు దోహదం చేస్తున్నాయని ఐఎండీ వివరించింది. రుతుపవనాల సీజన్ అంతటా ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ), ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) వంటి కీలక వాతావరణ వ్యవస్థలు తటస్థంగా కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, 2025 ప్రారంభ నెలల్లో ఉత్తరార్ధగోళం, యూరేషియా ప్రాంతాల్లో మంచు తక్కువగా కప్పబడి ఉండటం కూడా రుతుపవనాల క్రియాశీలతను పెంచే మరో ముఖ్యమైన అంశమని తెలిపింది. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందన్న ఈ అంచనా దేశ వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా ఖరీఫ్ పంటల ఉత్పత్తికి గణనీయమైన మేలు చేస్తుందని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో నీటిమట్టాలు తగ్గిన జలాశయాలు తిరిగి పుంజుకునేందుకు ఇది దోహదపడుతుంది. సమృద్ధిగా కురిసే వర్షాలు ద్రవ్యోల్బణం తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వరుసగా పదో సంవత్సరం కూడా సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుండటం గమనార్హం. ఇది దేశ వాతావరణంలో కొంత స్థిరత్వాన్ని సూచిస్తోందని అధికారులు తెలిపారు. అయితే, దేశంలోని చాలా ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ... లడఖ్, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. మొత్తంమీద, ఐఎండీ తాజా అంచనాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా రుతుపవనాలపై ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సానుకూల సంకేతాలని చెప్పవచ్చు.

# ఏటా 60 లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి అవకాశం

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తెలంగాణ ఈ ఏడాదిలో రికార్డుస్థాయిలో 280 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తిచేసి దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. రైతుల కృషితో పాటు అనుకూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి సహకారం, నూతన వరి రకాల వల్లే ఇది సాధ్యమైంది. రైతులను ప్రోత్సహించేందుకు సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. దొడ్డు రకాలైన ఎంటీయూ-1010, ఐఆర్-64లకు ఫిలిప్పీన్స్‌లో మంచి డిమాండ్ ఉంది. వరి నేరుగా విత్తడం, రోజు విడిచి రోజు నీరుపెట్టడం, తక్కువ రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వంటి విధానాలతో వరి రకాలను ఉత్పత్తి చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఎగుమతికి అనుకూల రకాల ఉత్పత్తికి రైతులకు.. వాటి ఎగుమతికి ఔత్సాహికులకు.. విధానపరమైన ప్రోత్సాహకాలిస్తాం. ఆధునిక రైస్‌మిల్లు నమూనాను అగ్రి వర్సిటీలో ఏర్పాటుచేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి తెలిపారు.

విశ్వవిద్యాలయ వీసీ అల్దాస్ జానయ్య, పరిశోధన సంచాలకుడు బలరాం, శాస్త్రవేత్త దామోదర్‌రాజు, వరల్డ్ ఫుడ్‌ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత, యూజీసీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ సమరేందు మహంతి, అఖిలభారత రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారావు, ఎఫ్‌సీఐ, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌర సరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

# కులగణన, ఎస్సీ వర్గీకరణ నిశ్శబ్ద విప్లవాలు

- మొదటి పేజి తరువాయి

సీఎల్పీ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. "అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం మంచిగా పనిచేస్తుందని లబ్ధిదారులు అనుకుంటున్నారు. సంక్షేమం ఒక ఎత్తయితే, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వేలను పకడ్బందీగా పూర్తిచేశాం. ఈ రెండింటినీ కొన్ని దశాబ్దాలుగా గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధీరోదాత్తంగా అందరికీ చెప్పి మరీ పూర్తిచేసింది. ఈ రెండు అంశాలు అమలు చేయాలని ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలవుతుంది. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన భారాస, కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపాల అస్తిత్వానికి ఈ రెండు అంశాలు ప్రమాదకరం. అందుకే అవి చేతులు కలిపి ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చిత్రీకరిస్తున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏనుగులు, పులులు తిరుగుతున్నట్టు ఏఐ టెక్నాలజీ ఉపయోగించి కుట్రలు చేస్తున్నాయి. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించాం. ఎస్సీ వర్గీకరణకు ఉత్తర్వులు జారీచేశాం" అని భట్టి చెప్పారు.

పారదర్శకంగా కులగణన సర్వే: పొన్నం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కులగణన సర్వేలో పారదర్శకంగా సమాచారం సేకరించాం. 1931 తరువాత మళ్లీ ఇప్పుడు మాత్రమే కులగణన జరిగిందని ప్రజలకు అవగాహన కల్పించాలి" అని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ధరణి స్థానంలో తెచ్చిన భూభారతి పోర్టల్ గురించి వివరించారు. రాష్ట్రంలోని లక్షల మంది రైతులకు భూభారతి వల్ల ఎంతో మేలు జరుగుతుందని, వారికి దీనిపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీతో ప్రజల్లో మంచి స్పందన వస్తుందని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, బుధవారం నుంచి జూన్ 2 వరకూ ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఎస్సీ వర్గీకరణ, భూభారతి పథకాల గురించి ప్రజల్లోకి వెళ్లి వివరించాలని నేతలకు సూచించారు.

# మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాలు

- మొదటి పేజి తరువాయి

ఇప్పటికే రూపొందించింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పోర్టల్, యాప్‌ను మంగళవారమిక్కడ సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, పుణ్య స్నానాలకు రోజుకు 50 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 'పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వరంలో 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటుచేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. 100 గదుల వసతి గృహం, డార్మిటరీ భవనాన్ని అందుబాటులోకి తెచ్చాం' అని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే సరస్వతి నది పుష్కరాలు జరిగాయని, ప్రస్తుతం పుష్కరాలు నిర్వహించే భాగ్యమూ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**పుష్కర సాన్నాలకు పీఠాధిపతులు**

పలు రాష్ట్రాల్లోని పీఠాధిపతులు పుష్కర స్నానమాచరిస్తారని దేవాదాయశాఖ తెలిపింది. మే 15న మెదక్ జిల్లా రంగంపేటలోని శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠానికి చెందిన మాధవానంద సరస్వతిస్వామి పుష్కరాలను ప్రారంభిస్తారు. 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, 19న నాసిక్ త్రయంబకేశ్వర్‌లోని మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి పుష్కరస్నానం ఆచరిస్తారు.

# జీసీసీలకు హబ్‌గా హైదరాబాద్

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో కార్యాలయాల స్థలాలకు డిమాండ్ గతేడాది 18 లక్షల చదరపు అడుగుల స్థలాలను వివిధ సంస్థలు అద్దెకు తీసుకున్నాయి. నగరంలో అమెజాన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియంట్, సిగ్నా వంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలు ఉండగా.. 3 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు. అయినా సీఎం రేవంత్‌రెడి ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలుముందుకొస్తున్నారు' అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ అండ్ సెక్యూరిటీ హెడ్ మైఖేల్, కాగ్నిజెంట్ అమెరికా అధ్యక్షుడు సూర్య గుమ్మడి తదితరులు పాల్గొన్నారు.

**మోదీకి సమాచారం లేకే అలా మాట్లాడారు**

హైదరాబాద్, న్యూస్‌టుడే: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ప్రధాని మోదీకి సమాచారం లేకే అలా మాట్లాడి ఉంటారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అవి ప్రభుత్వ భూములని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భాజపా పాలిత ప్రాంతాల్లో చాలా అటవీ భూములను నేలమట్టం చేసి భవనాలు నిర్మించారని ఆరోపించారు.

## ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మార్కులు రావనే అపోహను మీరు చెరిపేశారు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివితే మంచి మార్కులు రావనే అపోహను తొలగించి, ప్రభుత్వ విద్య గౌరవాన్ని నిలిపారని ఆయన విద్యార్థులను ప్రశంసించారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'షైనింగ్ స్టార్స్-2025' పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 52 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా వారికి బంగారు పతకాలు (గోల్డ్ మెడల్స్) అందించి, ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయానందాన్ని పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

"మీరంతా విజేతలు, మీకు నా హ్యాట్సాఫ్. ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారు. మీ అందరితో ఇలా కూర్చోవడం నా అదృష్టం. మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నా" అంటూ ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని' పునరుద్ధరించడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులకు భారం తగ్గిందని మంత్రి గుర్తుచేశారు. తాను పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కష్టపడి చదివానని, స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేసి, ప్రపంచ బ్యాంకులో పనిచేశానని తన అనుభవాలను పంచుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇంటర్ విద్యలో పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం పునరుద్ధరణ, ప్రిన్సిపాల్స్‌కు పదోన్నతులు వంటి అనేక సంస్కరణలు చేపట్టామని, చేయాల్సింది ఇంకా ఉందని తెలిపారు. జూన్ నాటికి విద్యాశాఖలో సంస్కరణలు పూర్తి చేసి, అభ్యాసన ఫలితాలపై (లెర్నింగ్ అవుట్‌కమ్స్) దృష్టి సారిస్తామని చెప్పారు. విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, వారిని చూసి అనేకమంది స్ఫూర్తి పొందాలని ఆకాంక్షించారు. "మీరంతా ఇప్పుడు ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. 40 ఏళ్లలో ఎవరూ గెలవని మంగళగిరిలో నేను అనేక సవాళ్లను ఎదుర్కొని గెలిచాను. కష్టమైనా విద్యాశాఖను ఏరికోరి తీసుకున్నాను" అని అన్నారు. ఇంటర్ తర్వాత ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలని, కేవలం ఐటీ మాత్రమే కాకుండా సోలార్ ఎనర్జీ, బయో గ్యాస్ వంటి కొత్త రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. చిన్న చిన్న అపజయాలకు కుంగిపోకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, విలువలను ఎన్నడూ మర్చిపోవద్దని హితవు పలికారు.

## పవన్ 'కన్వర్టెడ్ సనాతని'

- మొదటి పేజి తరువాయి

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఒక 'కన్వర్టెడ్ సనాతని' అని ఆయన అభివర్ణించారు. ఎన్నికలకు ముందు తన వైఖరికి, ఎన్నికల్లో గెలిచి ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రదర్శిస్తున్న వైఖరికి మధ్య స్పష్టమైన తేడా ఉందని పేర్ని నాని ఆరోపించారు. పేర్ని నాని మాట్లాడుతూ, "ఎన్నికల ముందు వరకు తనకు అన్ని మతాలు, కులాలు సమానమే అని పవన్ కళ్యాణ్ చెప్పారు. కానీ ఎన్నికల్లో గెలిచి, డిప్యూటీ సీఎం అయిన తర్వాత ఆయన కాషాయ వస్త్రాలు ధరించి, తాను సనాతన ధర్మ పరిరక్షకుడినని ప్రకటించుకుంటున్నారు" అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించుకున్న 'కన్వర్టెడ్ సనాతని' అని నాని వ్యాఖ్యానించారు. గతంలో పవన్ కళ్యాణ్ బాప్టిజం తీసుకున్నారని, ముస్లిం మతాన్ని కూడా ఆచరించారని ఆరోపించిన నాని, ఇప్పుడు ఆ రెండింటినీ పూర్తిగా గాలికి వదిలేసి 'కన్వర్టెడ్ సనాతని'గా మారారని ఎద్దేవా చేశారు. "ఆయనే అధికారికంగా, సిగ్గు ఎగ్గు లేకుండా డిక్లేర్ చేసేశారు కదా. ఎన్నికల ముందేమో అన్ని మతాలు ఒకటే అన్నారు, గెలిచి పదవిలోకి వచ్చాక కాషాయ బట్టలు కట్టుకుని హార్డ్ కోర్ సనాతని, కన్వర్టెడ్ సనాతని అని ఆయనే చెప్పేశారు. కాబట్టి ఆయన్ని ప్రశ్నించడానికి ఏముంది?" అని పేర్ని నాని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ తన వైఖరిని తానే స్పష్టం చేశారని, దీనిపై ఇక చర్చ అనవసరమని నాని చెప్పారు.

## విశాఖ నుంచి అమరావతికి హైదరాబాద్ మీదుగా రావాలా?

- మొదటి పేజి తరువాయి

మరో ప్రాంతానికి వెళ్లాలంటే తెలంగాణ మీదుగా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధాని అమరావతి వెళ్లాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి రావడం బాధాకరం. ఇవాళ ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చిన నేను విమానంలో హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుంచి విజయవాడ విమానం ఎక్కి గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాయంత్రం సమావేశం కావడానికి విశాఖ నుంచి బయలుదేరిన సీఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా నాలానే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకున్నారు. విశాఖ-విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. దురదృష్టవశాత్తు ఈరోజు మంగళవారం కావడంతో వందే భారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విజయవాడ చేరాల్సి వచ్చింది. ఇది విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి" అంటూ గంటా శ్రీనివాసరావు వివరించారు.

## అలా చేస్తే ఊరుకునేది లేదు

- మొదటి పేజి తరువాయి

మంత్రి వర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని అన్నారు. ఈ విష యంలో ఎవరేమి మాట్లాడినా ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు రేపటి నుంచి గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. తాను కూడా మే ఒకటో తారీఖు నుంచి ప్రజల్లోకి వెళతానని అన్నారు. మొన్నటి వరకు మనపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విమర్శలు చేసేవారని, ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రంగంలోకి దిగారని అన్నారు. తెలంగాణ పథకాలతో మోదీ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోందని వ్యాఖ్యానించారు.

## జ్వరంతో కేబినెట్ సమావేశానికి పవన్ దూరం

- మొదటి పేజి తరువాయి

కావాల్సి ఉండగా ఆయన 10:30లోపే సచివాలయానికి చేరుకున్నారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో సమస్య తీవ్రమవడంతో వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లిఫ్ట్ వద్ద నిలబడలేక పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుండిపోయారు. కాసేపటికి కిందకు వచ్చి వెళ్లిపోయారు. క్యాంపు కార్యాలయానికి చేరుకున్నాక వైద్యం చేయించుకున్నారు. సాయంత్రం అక్కడే ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో పవన్ సమావేశమయ్యారు. మరోవైపు మంత్రి పార్థసారథి వ్యక్తిగత కారణాలతో సమావేశానికి గైర్హాజరయ్యారు.

# భూభారతి తో గ్రామాల్లో రెవిన్యూ సేవల పునరుద్ధరణ.

రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**భూభారతీ ఏర్పాటు తో గ్రామాల్లో రెవిన్యూ సేవల పునరుద్ధరణ జరుగుతున్నధని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధ పురం రైతు వేదిక వద్ద భూభారతి పోర్టల్ ప్రారంభం కార్యక్రమాన్ని లైవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ భూ పరిపాలనలో నూతన అధ్యాయం ఏర్పాటు చేశారన్నారు. గత ప్రభుత్వంలో ధరణి వలన భూ వ్యవస్థ చిన్నాభిన్నమైందని దాన్ని ప్రక్షాళన పరిణామమే భూభారతి పోర్టల్ ఏర్పాటు అని అన్నారు. వ్యవస్థకు రూపకల్పన చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు రుణపడి ఉంటారని కొత్వాల అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి శంభో శంకర్,ఏ ఏ ఓ లు వై.సత్యం ఎం.సుజాత, ఎన్ అనురిక, జి.నరేష్, సొసైటీ డైరెక్టర్ చౌగని పాపారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, మాజీ జడ్పిటిసి మాలోతు నంద నాయక్, పాల్వంచ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు కొండం పుల్లయ్య, గంధం నరసింహారావు, కందుకూరి రాము, ఉండేటి శాంతివర్ధన్, బండి అంబేద్కర్ కలకొండ నరసింహారావు, బ్రహ్మచారి, అజ్మీర రమేష్, బండి నాగరాజు, గోదాకృష్ణ, దేరంగుల చిట్టిబాబు,తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ 2018 ఉపాధ్యాయులకు రెన్యుమరేషన్ చెల్లించాలి.

- బుటారి రాజు టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**
ఫిబ్రవరి 2025 నెలలో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమింప బడిన డీఎస్సీ 2008 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ మోడ్ లో ట్రెజరీ సైట్ లో ఉపాధ్యాయుడి పేరు, ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్ తో అనుసంధానం చేసి డ్రాయింగ్ ఆఫీసర్లు వారికి రెన్యుమరేషన్ చెల్లింపబడునట్లు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు సంబంధిత డ్రాయింగ్ అధికారులకు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు జోగా రాంబాబు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో బుటారి రాజు మాట్లాడుతూ టీపీటీఎఫ్ ప్రాతినిధ్యం వలన రాష్ట్ర విద్యాశాఖ మరియు ట్రెజరీ అధికారులు కాంట్రాక్టు ఉపాధ్యాయుల రెన్యుమరేషన్ చెల్లింపును ట్రెజరీ సైట్ లో ఎనేబుల్ చేయడం జరిగిందని, ట్రెజరీ ఫార్మ్ 58 లో బిల్ చేయాలని తెలిపారు.

ప్రస్తుత పాలకులు ఎన్నికల సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలుపరచకపోవడం, సమస్యల పరిష్కారము నకు ఉద్దేశించబడిన మంత్రివర్గ ఉప సంఘం తన విధులను విస్మరించడం, గత ప్రభుత్వం విధానాలను విమర్శిస్తూ కాలయాపన చేయడం లాంటి చర్యల మూలంగా రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ప్రకటించుకున్న పోరాట కార్యక్రమాలను విజయవంతం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉద్యోగులను ఆర్థికంగా కృంగదీస్తున్నారని, భవిష్యత్తు అవసరాలకొరకు తాము పొదుపు చేసుకొని దాచుకున్న సొమ్మును కూడా సకాలంలో చెల్లించకపోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనమని అన్నారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ విద్యారంగం ఉపాధ్యాయుల సమస్యలపై కూడా కార్యచరణ రూపొందించుకొని పోరాటాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యులు మునిగడప రామాచారి, రాష్ట్ర కౌన్సిలర్ కెచ్చల మాధవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పోలేబోయిన గంగరాజు, సనప కృష్ణబాబు, వాంకుడోత్ సరియా, బూరుగు హనుమంతు లు పాల్గొన్నారు.

# సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావును అభినందించిన ఎమ్మెల్యే తెల్లం.

సిటీ స్టైల్ జిమ్ కోచ్ జివి రామిరెడ్డి.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**ఖమ్మం జిల్లాలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మాస్టర్ టీం ఛాంపియన్షిప్ ను కైవసం చేసుకుంది. కాగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ లో కోచ్ జివి రామిరెడ్డి దగ్గర శిక్షణ తీసుకున్న 72 సంవత్సరాల డివి శంకర్రావు, గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కూడా వైద్యుల పర్యవేక్షణ లో మాస్టర్ 4 విభాగంలో 83 కేటగిరీలో 60 కేజీల బరువెత్తి బంగారు పతకం సాధించిన డివి శంకర్రావును భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం శాసనసభ పరిధిలోకి వచ్చే ప్రజలు అందరూ బైపాస్ సర్జరీ అయినా కానీ గోల్డ్ మెడల్ కొట్టిన డీవీ శంకర్రావుని ఆదర్శంగా తీసుకుని,తమకు అనారోగ్య సమస్యలు వున్నాయి అని చెప్పి వైద్యుల పర్యవేక్షణ లో రోజూ చేసే వ్యాయామానికి దూరంగా ఉండి మరింత అనారోగ్యం కు గురికావొద్దని తెలిపారు. బైపాస్ చేయించుకున్న వ్యక్తితో గోల్డ్ మెడల్ కొట్టించిన జిమ్ కోచ్ జివి రామిరెడ్డిని మరియు అసోసియేషన్ సభ్యులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డా. శివరామకృష్ణ ప్రసాద్, ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ మోడెం వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 15 :** జ్ఞానాపురం రైల్వే స్టేషన్ బస్టాప్ ఎదురుగా రోడ్డుపై బిక్షటన చేసుకునే. గుర్తు తెలియని వ్యక్తి మృద్ధుడు ఊరు పేరు తెలియదు. సుమారు వయసు.65 నుంచి 70 వర్క్ ఉంటాయి ఈరోజు.15.04.2025 మరణించాడు. ఈ విషయం తెలుసున్న ఔర్ హ్యాండ్ . అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు కి 41 వ వార్డు టి డి పి అధ్యక్షుడు ఐతి మధుబాబు , ఐతి రవిబాబు, లైటింగ్ శివ సమాచారం అందించగా. అనాధ మృతదేహానికి అంతిమక్రియలకు చేసేందుకు పిల్లి గోవింద్రాజు టీమ్ తో అప్పగించారు. అంతిమక్రియలకు కావాల్సిన వాహనం , మృతదేహం ఖననంకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. శ్మాసన వాటిక సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ వి వెంకట్రావు గారు మొబైల్ కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు . స్మశానం వాటికలో కార్యక్రమం మంగళవారం పూర్తి చేయడం జరిగింది.



# న్యాయవాదుల చట్టం సవరణకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విస్తృత ప్రచారం.


**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**అడ్వకేట్స్ యాక్ట్ కు సవరణ చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న ప్రతిపాదిత బిల్లును వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయ వదుల్లో విస్తృత ప్రచారం చేపట్టింది.

ప్రతిపాదిత సవరణలతో బార్ కౌన్సిల్ స్వతంత్ర ప్రతిపత్తి ప్రశ్నార్ధకం అవుతుందని, న్యాయవాద వృత్తి మనుగడకు ప్రమాదకరంగా పరుణమిస్తుందని, ప్రస్తుత చట్టాన్నే కొనసాగించాలని, విదేశీ లాయర్లను అనుమతించొద్దని ఏ.ఐ.ఎల్.యు. నాయకులు డిమాండ్ చేశారు.

ప్రచారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ముసాయిదా బిల్లు ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలతో కూడిన ఎనిమిది పేజీల వివరణాత్మక కరపత్రాన్ని ఏ.ఐ.ఎల్.యు. జిల్లా కమిటీ ఆధ్వర్యం లో ఆవిష్కరించి విడుదల చేసారు. జిల్లా వ్యాపితంగా న్యాయ వాదులకు మంగళవారం కరపత్రాన్ని పంపిణీ చేశారు. కరపత్రంలో కొత్త ముసాయిదా బిల్లులోని లోపాలు, కేంద్ర ప్రభుత్వ ఏకపక్షవైఖరిని వివరించారు. ముసాయిదా బిల్లులో న్యాయవాదుల రక్షణ, సంక్షేమ చర్యలపై ఏమీ లేకపోగా, వృత్తిని ప్రమాదంలో పడేసే ప్రతిపాదనలు ఉన్నాయని తప్పుబట్టారు.

ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం సవరించాలని చూస్తే, దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొత్త బిల్లుపై ఇప్పటికే ఐలు పరిశీలనలు, ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్రప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కేవలం న్యాయవిద్య చదువుకున్న వారు మాత్రమే న్యాయ వాద వృత్తిలోకి అనుమతించాలని, న్యాయవాదులు మాత్రమే బార్ కౌన్సిళ్లకు ప్రాతినిధ్యం వహించాలని ఏ.ఐ.ఎల్.యు. నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయా రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలోగానీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలోకి గాని కేంద్ర ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదేతర వ్యక్తులను నియమించాలని చూడటం అప్రజాస్వామ్య విధానమని విమర్శించారు. కొత్త సవరణ చట్టం న్యాయవాదుల ఉనికిని దెబ్బతీసేవిధంగా ఉందని గుర్తు చేశారు. కొత్త ప్రతిపాదిత ముసాయిదాలో తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ పేరే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బార్ కౌన్సిళ్ల ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్నాయని గుర్తు చేశారు. కేసులను ఎదుర్కొంటున్న న్యాయవాదులు ఆయా సందర్భాల్లో అనర్హతకు గురయ్యే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. లౌకిక, ప్రజాస్వామ్య, స్వతంత్ర భారతదేశంలో న్యాయవాదులతో సంప్రదించకుండా కొత్త చట్టం తేకూడదని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని, న్యాయవాదులను కాపాడుకునేందుకు ఎంతవరకైనా వెళతామని స్పష్టం చేశారు. ప్రజలు, న్యాయవాదుల తరపున ఉద్యమాలు, పోరాటాలు చేయకుండా అడ్డుకోవడానికే కొత్త చట్టం ద్వారా నియంత్రించాలని కేంద్రం చూస్తున్నదని విమర్శించారు.

సామాజిక ఉద్యమాల్లో న్యాయవాదులు పాల్గొనకుండా చూడాలనుకోవడం అవివేకమని చెప్పారు. బార్ కౌన్సిల్ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనుకోవడం కేంద్ర ప్రభుత్వ భ్రమ మాత్రమేనని వ్యాఖ్యానించారు. కొత్త సవరణ చట్టం ప్రతిపాదనల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ న్యాయ వాదులకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనలేవీ లేవని గుర్తు చేశారు. ఇప్పటివరకు కౌన్సిళ్లు స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయని, కొత్త సవరణ ముసాయిదా ఆ స్వతంత్రతను దెబ్బతీసేలా, వాటి స్వయం ప్రతిపత్తికే ప్రమాదం తెచ్చేలా ఉందని చెప్పారు. న్యాయవాదులు కాని వ్యక్తులను భారత బార్ కౌన్సిల్లో నియమించాలని చూస్తున్నదనీ, ఇది న్యాయవాదులను అవమానించడ మేగాక, కోర్టు అధికారాలను కించపరచడమే అవుతుందని చెప్పారు. ఆందోళన, నిరసనలు, ఉద్యమాలు చేయకుండా న్యాయవాదులను అణిచివేసే ప్రక్రియే కొత్త ముసాయిదా చట్టమని చెప్పారు. కొత్త బిల్లు ద్వారా న్యాయవాదులపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. గాంధేయ మార్గంలో ఆందోళన చేసినా వృత్తి నుంచి బయటకు పంపే ప్రయత్నం కేంద్రం చేస్తున్నదన్నారు. విదేశీ న్యాయవాదులను దేశంలోకి అనుమతించ రాదనీ, వారిపై నియంత్రణ చేయడం సాధ్యం కాదన్నారు. విదేశీ న్యాయవాదులను దేశంలోకి అనుమతిస్తే భారత న్యాయవ్యవస్థను అవమానించ డమే అవుతుందని చెప్పారు. న్యాయవాదులపై దాడుల నివారణకు ఎలాంటి ప్రతిపాదనలు కొత్త ముసాయిదాలో లేవని అభి ప్రాయ పడ్డారు. న్యాయవాదుల (సవరణ) బిల్లు–2025ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కరపత్రాన్ని ఐలు నాయకులు ఎం.వి. ప్రసాదరావు, రమేష్ కుమార్ మక్కడ్, జె. శివరాం ప్రసాద్, కె.పుల్లయ్య, పి.కిషన్ రావు, పాయం రవివర్మ, బందారు అరుణ్, రావిలాల రామారావు, అరికాల రవి కుమార్, మెదరమెట్ల శ్రీనివాస రావు, యు.గౌతమ్ కుమార్ తదితరులు ఆవిష్కరించారు.



# వరంగల్ సభకు భద్రాద్రి పట్టణం నుండి అధిక సంఖ్యలో కదలాలి...

- పట్టణంలో ప్రతి వార్డులో 27న గులాబీ జెండా ఎత్తాలి...
- మండల పార్టీ అనుబంధ రంగాల సమావేశంలో రావులపల్లి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్)ఏప్రిల్ 15,**25 సంవత్సరాల రజతోత్సవ బహిరంగ సభ వరంగల్ జరుగుతుందని పట్టణం నుండి వరంగల్ కు అధిక సంఖ్యలో శ్రేణులు కదలి రావాలని బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు.

మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో మండల పార్టీ అనుబంధ రంగాల కమిటీల సమావేశం మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ 27వ తేదీన భద్రాచలం పట్టణంలోని అన్ని వార్డులలో కార్యకర్తలు గులాబీ జెండా ఎత్తి వరంగల్ కు బయలుదేరారని..

తెలంగాణ తెచ్చిన పార్టీ తెలంగాణ అభివృద్ధి చేసిన పార్టీ బిఆర్ఎస్ అన్నారు...

అనంతరం నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ మాట్లాడుతూ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో వరంగల్ సభ జరగబోతుందని.. గులాబీ కార్యకర్తలకు ఇది ఒక పండుగ వాతావరణంలో.. తెలంగాణ ప్రజల సొంత పార్టీ సభకు ప్రజలందరూ రావాలని పిలుపునిచ్చారు...

ఈ సమావేశంలో మండల పార్టీ కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు కొల్లం జయ ప్రేమ కుమార్, మండల పార్టీ నాయకులు కాపుల సూరిబాబు,మోరాల డానియల్ ప్రదీప్, గుంజ ఏడుకొండలు,అయినాల రామకృష్ణ,బద్ది బాబి, మోహన్ రావు, రావూరి రవి కిరణ్,జక్కం గోపి, ఇమంది నాగేశ్వరరావు, పసుపులేటి రమేష్, మహిళా నాయకులు పూజల లక్ష్మి, ఏలూరి ప్రియాంక, తెల్లం రాణి, సలోమి తదితరులు ఉన్నారు

# నూతన ఎస్సై పి వి నాగేశ్వరరావు ని మర్యాద పూర్వకంగా కలిసిన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పి వి నాగేశ్వరరావుని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల భద్రత మరియు శాంతి స్థాపనలో విజయవంతంగా ముందడుగు వేయాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు..

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిజ్జా రామనాథం,మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు , మండల యువజన అధ్యక్షులు కునుసోత్ సాగర్, మండల నాయకులు బరపాటి వెంకన్న, పూనెం బుచ్చయ్య,కొమరం వెంకటేశ్వర్లు, వగలబోయిన శ్రీను, దొంతు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు...

# పోలమాంబ అమ్మవారి పరస



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 15 :** పోలమాంబ అమ్మవారి ఆలయంలో చాంద్రమాన స్వస్తిశ్రీ. సోమవారం ఉదయం తొళ్ళేళ్ళు ప్లవనామ సంవత్సర చైత్ర చతుర్దశి అనగా మరియు అవ్మ రి 5 జలాభిషేకం ఉదయం 7.30 నుండి జరపబడును మరియు చైత్ర పూర్ణిమ మంగళవారం అనగా15:4.2025 స్వాతి నక్షత్ర యుత వృషభలగ్నమందు అమ్మవారికి పరస జాతర కార్యక్రమం జరపబడును. అమ్మవారి అలంకరణ మరియు కుంకుమ పూజలు జరపబడును. కావున భక్తులు యావన్నంది ఈ కార్యక్రమములో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులగుదురని అలాగే సాయంత్రం భజన కార్యక్రమం జరుగును అని, అందరూ ఆహ్వానితులే అని ఆలయ కమిటీ వారు తెలియజేశారు.. గొప్ప అన్నదానం జరుగుతుంది. దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావలసిందిగా కోరుతున్నాం.

# 50 తునికాకుల కట్టకు 5 రూపాయలు ధర చెల్లించాలి.

- తునికాకు సేకరణ పనులు వెంటనే ప్రారంభించాలి.
- కల్లాల పనులకు అదనంగా 25 శాతం పెంచి ఇవ్వాలి.
- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిమాండ్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ ములకలపల్లి, ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**జిల్లాలో అటవీ ప్రాంతాల అంతటా తునికాకు సేకరణకు చర్యలు వెంటనే ప్రభుత్వం చేపట్టాలని,50 తునికాకుల కట్టకు ఐదు రూపాయలు ధర చెల్లించాలని,గత పెండింగ్లో ఉన్న బోనస్ లను వెంటనే కార్మికులకు ఇవ్వాలని,తుని కాకు కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, కల్లాల్లో మంచినీరు, వైద్య సౌకర్యం కల్పించాలని,కల్లాల్లో జరిగే ఇతర పనులకు గతం మీద 25 శాతం అదనంగా రేట్లు పెంచి ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి,ఉపాధికి బీడీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని,దానికి అనుబంధంగా గోదాములు నిర్మించాలని డిమాండ్ చేస్తూ,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ములకలపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయ అధికారికి అందించడం జరిగింది.ఈ సందర్భంగా మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూప భాస్కర్,అఖిలభారత ఐక్య రైతు సంఘ జిల్లా కార్యదర్శి కల్లూరు కిషోర్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘ డివిజన్ కార్యదర్శి పొతుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ సంవత్సరం వేసవి కాలంలో రాష్ట్రంలో జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఏ పని దొరకని వేసవి సమయంలో తునికాకు సేకరణ పనులను చేపట్టడం ద్వారా ఆదివాసీలు ఇతర పేదలు ఆరు లక్షల మందికి ఉపాధిని కల్పించడానికి మంచి అవకాశం ఉన్నదని తునికాకు ఏజెన్సీ ప్రాంతంలో సహజమైన అటవీ ఆదాయ వనరు దీనికోసం ప్రభుత్వానికి ప్రత్యేకంగా పెట్టుబడి అవసరం ఉండదు ఇలాంటి సహజమైన ఆర్థిక వనరైనటువంటి తునికాకుని ప్రభుత్వం తునికాకు యూనిట్లను వేలం పాటల ద్వారా గాని ప్రభుత్వం నిర్వహించడం ద్వారా గాని మోడెం నరికించే పనులు సకాలంలో చేపడితే ఉత్పత్తి విస్తృతంగా వస్తుంది,ఆకు వేపుగా పెరుగుతుంది ఈ విధంగా ఉత్పత్తి అయిన ఆకును సకాలంలో సేకరించుటకు ప్రభుత్వం పూనుకుంటే ప్రజలకు చేతినిండా పని లబిస్తుంది ఆదాయం వస్తుంది కానీ ప్రజా ప్రభుత్వాలుగా చెప్పుకునే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కృషి చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి ఈ పని చేయటం భారమైనది కాదు ఈ పనులు చేపట్టడం ద్వారా ఏజెన్సీలో లక్షలాదిమందికి ఉపాధి లభించడమే కాకుండా బయట ప్రాంతాల్లో ఉన్న బీడీ వర్కర్స్ ఏడు లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు.తునికాకు పై వచ్చే లాభాలను ఆకు సేకరణ కార్మికులకు బోనస్ గా చెల్లిస్తామని గత ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో ప్రకటించింది కానీ అమలు మాత్రం సరిగ్గా జరగటం లేదు బాగా నిర్లక్ష్యంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఇదుకు అనేక కొర్రీలు పెడుతున్నాయని విమర్శించారు.ఇవి ఆచరణకు సాధ్యం కానిది కూడా కాదు బోనస్ లు ఇస్తామని నిర్ణయించి బోనస్ ను సంవత్సరాల తరబడి ఆకు సేకరణ కార్మికులకు నాలుగు సంవత్సరాలుగా 18 కోట్ల రూపాయలు ఇవ్వకుండా తెలంగాణ ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు.వాస్తవానికి తునికాకు సేకరణ గతం కంటే చాలా కష్టమైన పనిగా మారింది పలు కారణాలతో ఆకు సరిగా లభించడం లేదు కొన్ని సమయాల్లో జంతు దాడులు,వడదెబ్బకు గురై చనిపోతున్నారు ఇలాంటివారి యెడల ప్రభుత్వం శ్రద్ధ పెట్టి రక్షణ చర్యలు చేపట్టాలని,బీమా సౌకర్యం కల్పించాలని,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 14 జిల్లాలలో 196 తునికాకు యూనిట్లు ఉన్నాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 29 యూనిట్లు నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది కానీ తునికాకు సీజన్ సక్రమంగా నడుపుటకు వేగవంతంగా చర్యలు చేపట్టడంలో కార్మికులకు ఆసక్తి కలిగించడం లో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ములకలపల్లి,అన్నపురెడ్డిపల్లి సంయుక్త మండలాల కార్యదర్శి కోర్సా రామకృష్ణ, మండల నాయకులు నకిరికంటి నాగేశ్వరరావు ఎర్ర గొర్ల రామారావు, రాయబారపు వెంకటేశ్వర్లు, కీసరి బాబురావు గోపాలరావు వెలకం కన్నయ్య, కనితి వెంకటేశ్వర్లు సున్నం రాజులు సున్నం వీరస్వామి,పాయం ముత్తయ్య కోండ్రుం శ్రీను యుకె నారాయణ కనితి నగేష్ వీరస్వామి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం టు చర్ల ప్రధాన రహదారి మరమ్మత్తులు చేయాలి.

- రోడ్డు సమస్య భద్రాచలం ఎమ్మెల్యే కి పట్టదా.
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**దుమ్ముగూడెం మండలం బుర్ర వేముల గంగోలు మధ్య ఉన్న ప్రధాన రహదారి దగ్గర సిపిఎం పార్టీ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం నుండి చర్ల వెంకటాపురం మండలాల వరకు ఉన్న ప్రధాన రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని భద్రాచలం నియోజవర్గ స్థానిక ఎమ్మెల్యేను సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు, అదేవిధంగా దుమ్ముగూడెం మండలంలో తూరుబాక గ్రామం లో ఉన్న ప్రధాన రహదారి దగ్గర ఉన్న వంతెన కూలిపోతున్న స్థానిక ఎమ్మెల్యే అదే విధంగా ప్రభుత్వ అధికారులు పట్టించుకోరా నెలలుగ దుస్తున్న ప్రతి రెండు మూడు రోజులకు ఒక్కరు రోడ్డు యాక్సిడెంట్లో మరణిస్తున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు భవిష్యత్తులో రహదారుల సమస్య పరిష్కరించక పోతే సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరిక చేస్తున్నాం అన్నారు, మొన్న జరిగిన బడ్జెట్ సమావేశాలలో ఈ రహధారులకు ఎన్ని నిధులు కేటాయించారు కూడా స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు, ఇసుక ర్యాంపులకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇవ్వడం రోడ్లు పాడైపోయినప్పుడు పట్టించుకోపోవడం ప్రజలు చాలా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం అసలు ఉన్నట్టా లేనట్టా అంటే ఎందుకు పట్టించుకోవట్లేదు అని నెలకు 5 నుండి 6 మంది రహధార్లు గుంతలు ఉండడం వల్లనే ప్రమాదం జరిగి చనిపోతున్నారని గుర్తు చేశారు, మంత్రులు కూడా జోక్యం చేసుకోవాలని గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు గారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆంధ్రకు పోయిన ప్రాంతం మాకు ఇస్తే మేము బాగు చేస్తామని అన్నారు మన తెలంగాణ ప్రాంతంలో ఉన్న మన రోడ్ల సమస్య పరిష్కారం కావడం లేదు వెంటనే పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచన చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి మండల కార్యదర్శి కారం పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ ,మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ,మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి శ్రీను బాబు, బొల్లి సత్య నారాయణ,కాక కృష్ణ , సోడె రాంబాబు,పూనెం శోభారాణి, గుడ్ల రామ్మోహన్ రెడ్డి, వర్సా చిన్నారావు, తెల్లం ధర్మయ్య, కల్లూరి దేవి, కొమరం చంటి, పాయం హరిబాబు, కనకారావు, పెనుబల్లి ప్రసాద్,ఉబ్బా చిన్నారావు, అహ్మద్ హుస్సేన్,కొర్స నాగరాజు ఇంకా తదితరులు పాల్గొన్నారు

# గులాబీ దండు కదం తొక్కాలి..!

- కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి..!!
- ఎంపీ వద్దిరాజు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 15,**వరంగల్ లో జరిగే సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులను చూసి కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని అన్నారు. మాజీ శాసనసభ్యురాలు బాణోత్ హరి ప్రియా నాయక్ అధ్యక్షతన మంగళవారం ఇల్లెందు నియోజకవర్గ పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్ లో పది లక్షల మందితో జరిగే సభలో.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం మాట్లాడుతరోనని తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదిన్నరకే ప్రజలు విసిగి, వేసారి పోయారని అన్నారు. ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. కేసీఆర్ ను దూరం చేసుకుని తప్పు చేశామని ప్రజలంతా పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేద్దామని భ్రమ పడుతున్న ముఖ్యమంత్రి.. తాను కూర్చున్న కుర్చీ కూడా కేసీఆర్ పెట్టిన బిక్షే అని గుర్తెరగాలని అన్నారు. కేసీఆర్ పోరాటం చేయకపోతే ఇవాళ రాష్ట్రమే వచ్చేది కాదని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. వరంగల్ సభ విజయవంతానికి దిశా నిర్ధేశం చేశారు. బహిరంగ సభకు హాజరయ్యే ముందు పార్టీ కార్యకర్తలంతా తమ తమ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించుకుని బయలుదేరాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మహబూబాబాద్ జెడ్పీ మాజీ ఛైర్మన్ అంగోత్ బిందు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్ నాయక్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు శీలం రమేష్, బొమ్మెర ప్రసాద్, తాతా గణేష్, లక్ష్మణ్ నాయక్, పరుచూరి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జెకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ వృత్తి బాధ్యతతో నిర్వహించాలి.



**-డాఎల్.భాస్కర్, జిల్లా వైద్యశాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,**భద్రాచలం లోని మారుతి నర్సింగ్ కళాశాలలో జరిగిన 'థ్యాంక్స్ గివింగ్' %డ% ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యశాఖ అధికారి డా ఎల్. భాస్కర్ మాట్లాడుతూ. నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, అంకిత భావం, బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలో అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, నైపుణ్యత పెంచుకుని విదేశాలకు వెళ్ళుటకు నర్సింగ్ విద్యార్థినులు చొరవ చూపాలని ఆయన తెలియజేశారు. క్యాంపస్ సెలక్షన్స్కు 45 మంది విద్యార్థులు ఎంపికైనారు.
ఈ సందర్భంగా మారుతి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ డాఎస్.ఎల్.కాంతారావు మాట్లాతూ బిఎస్సీ(నర్సింగ్) కోర్సు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి, 45 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ నందు 22 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనారు. మరియు భాస్కర మెడికల్ హాస్పిటల్ హైదరాబాద్లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపినారు.
అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన నర్సింగ్ విద్యార్థినులు మాట్లాడుతూ మేము మారుమూల గిరిజన ప్రాంతంలోని అతి నిరుపేద కుటుంబాల నుండి వచ్చి నర్సింగ్ విద్యను అభ్యసించి ఉద్యోగాలు పొందడం ఆనందంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన మారుతి నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ డాఎస్.ఎల్.కాంతారావు గారికి, కళాశాల యాజమాన్యానికి, కిమ్స్ హాస్పిటల్, భాస్కర హాస్పిటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపినారు.
ఈ కార్యక్రమంలో డా ఎస్. ఎల్. కాంతారావు, డా బి.సుబ్బరాజు, ఎస్ఎన్వి రామారావు, డాఎయం.వి. కోటిరెడ్డి, డాఎపుల్లయ్య, డాఎ చైతన్య డిప్యూటీ డిఎం %డ% హెచ్వి, డాఎసంతోష్, డాఎ పి. రాజశేఖర్, టి. సిద్దులు, సీతారామిరెడ్డి, గోళ్ళ భూపతిరావు, చావా లక్ష్మీనారాయణ, వై. సూర్యనారాయణ, పల్లంటి దేశప్ప, వి.కామేశ్వరరావు, రాజు, మారుతి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోషక ఆహారంపై అవగాహన సదస్సు



లింగారెడ్డి గూడ గ్రామంలో అమృత అంగన్వాడీ టీచర్ ఆధ్వర్యంలో

**సి కే న్యూస్ షాద్ నగర్: ఏప్రిల్ 15**: షాద్ నగర్ నియోజకవర్గం లోని ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడా గ్రామంలో మంగళవారం రోజు పోషక పక్షంలోని సందర్భంగా 08/04/2025 నుండి 22/04/2025 వరకు దానిలోని భాగంగా కే. అమృత అంగన్వాడీ టీచర్ ఆధ్వర్యంలో
లింగారెడ్డి గూడా అంగన్వాడి 2 కేంద్రంలో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
దీనిలో భాగంగా గర్భవతులు బాలింతలు తల్లులకు 1000 రోజుల ప్రాముఖ్యత లబ్ధిదారుల మాడ్యూల్ గురించి పోషక ఆహార లోపం ఉన్న పిల్లలు ఉబకాయంపై అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.డి.పి.ఓ షబానా, సూపర్వైజర్ జయలక్ష్మి,గ్రామ పంచాయతీ కార్యదర్శి అర్జున్ కుమార్ ఎ.న్. ఎం.నిర్మల ఆశ కార్యకర్తలు గ్రేస్ సరళ మహిళా సంఘం అధ్యక్షులు జి. మాధవి బి. మంగమ్మ మరియు మహిళా సంఘం సభ్యులు మరియు అంగన్వాడీ ఆయా కృష్ణమ్మ పాల్గొనడం జరిగింది.

# రాజ్యాంగ పరిరక్షణకై, జై బాపు, జై భీమ్, జై సమిదాన్ కాంగ్రెస్ పార్టీ, యాత్ర, పోలంపల్లిలో

**చేగుంట కోఆర్డినేటర్ మల్లారెడ్డి**

**ఏప్రిల్ 15 ( సీ కే న్యూస్) చేగుంట :** మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో, మంగళవారం నాడు, రాజ్యాంగ పరిరక్షణకై కాంగ్రెస్ పార్టీ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని, చేగుంట మండల్ కాంగ్రెస్ పార్టీ, కోఆర్డినేటర్ గా మల్లారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. చేగుంట మండల్ పొలంపల్లి గ్రామం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా జైత్రయాత్ర వివరాలను తెలియజేస్తూ మండల నాయకులు వివిధ హెూదా అధ్యక్షులు కార్యకర్తలు పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, జనరల్ సెక్రటి మొజామిల్, కొండి శ్రీనివాస్, ఓబీసీ అధ్యక్షులు అన్నం ఆంజనేయులు,ఎస్సి సెల్ అధ్యక్షులు స్టాలిన్ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్ కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, బాసరాజు, పోలంపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కరే స్వామి, ఉపాధ్యక్షులు కొండి మల్లేశం, మాజీ సర్పంచ్ చౌడం నాగమణి, చిన్న చౌడ నర్సింలు, కొండి రాజు, యట నరేష్, కొండి లక్ష్మణ్, డీ సురేష్, జె స్వామి, వై యాదగిరి, వై సత్యం, కే నర్సింలు, చిన్న స్వామి, కే శేఖర్, చిన్న వెంకట్, కిషన్, వెంకట్, నర్సింలు, ఎం నర్సింలు, దుర్గయ్య, కే రాములు, ఎల్లం, వెంకటేష్ జి సతయ్య, కళావతి, సులోచన, గ్రామ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ బస్టాండ్ లో పార్కింగ్ లేక పబ్లిక్ పరేషాన్

- వాహనదారుల భద్రతపై ప్రశ్నార్థక చిహ్నం
- పార్కింగ్ లేకపోవడంతో ప్రయాణికులకి అసౌకర్యాలు
- వాహనాలు చోరీకి గురవుతున్నా అధికారులు మౌనమే
- డిపో మేనేజర్ స్పందన: ఈ నెలలో పార్కింగ్ పునరుద్ధరణ




**సి కే న్యూస్ షాద్ నగర్:ఏప్రిల్:**షాద్నగర్ బస్టాండ్ ప్రాంతంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురవడంతో ఈ సమస్య మరోసారి చర్చనీయాంశంగా మారింది.దేవునిపల్లి గ్రామానికి చెందిన సతీష్ గౌడ్ అనే వ్యక్తి తను సొంత పని నిమిత్తం తన బైక్ను బస్టాండ్ వద్ద పార్క్ చేసి మహబూబ్నగర్కు వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో తిరిగొచ్చిన సమయంలో, బైక్ కనిపించకపోవడంతో షాక్కు గురయ్యాడు. వెంటనే షాద్నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పార్కింగ్ ఉండదు, భద్రత ఉండదు... మన వాహనాలు భరోసా లేకుండా పోతుందని అంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పార్కింగ్ స్థానాన్ని ఎందుకు ఎత్తివేశారో, తిరిగి ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారో అధికారులు చెప్పకపోవడంతో వాహనదారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.ముఖ్యంగా బస్టాండ్కు వచ్చే ప్రయాణికులు తమ వాహనాలను ఎక్కడ ఉంచాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ ఏర్పాట్లు లేకపోవడంతో, వాహనాలు అజ్ఞాత ప్రదేశాల్లో ఉంచాల్సి వస్తుండటంతో చోరీలకు అవకాశం పెరిగిందని వాదిస్తున్నారు.ఇప్పటికే పలు బైక్లు చోరీకి గురైయ్యాయని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు నమోదయ్యాయని సమాచారం. అయినా సంబంధిత అధికారులు ఈ విషయంలో మౌనమే వహిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వాహనదారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. పార్కింగ్ ఏర్పాట్లను వెంటనే పునరుద్ధరించాలని అంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### షాద్ నగర్ డిపో మేనేజర్ వివరణ

గతంలో కూడా అనేక వాహనాలు చోరీకి గురైనట్లు తమకు సమాచారం అందిందని, టెండర్లు గడువు పూర్తి కావడంతో పార్కింగ్ అసౌకర్యం ఏర్పడిందని పేర్కొంది. అదేవిధంగా ఈ నెలలో పార్కింగ్ పునరుద్ధరణ కోసం చర్యలు చేపడుతున్నామని వివరణ ఇచ్చారు. భద్రతపరంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వాహనాలు నడుపునప్పుడు తప్పక శిరస్త్రాణం ధరింపవలెను.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 15,** ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నందున ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు వాహనాలపై ప్రయాణం చేస్తున్నప్పుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి ప్రయాణించాలని అలాగే ఫోర్ వీలర్ వాహనాలలో ప్రయాణిస్తున్నప్పుడు (కారులో) సీట్ బెల్ట్ తప్పక ధరించాలని తద్వారా ప్రయాణిస్తున్నప్పుడు ఏవైనా విపత్తులు సంభవించినట్లయితే ప్రాణాపాయం జరగకుండా ఉంటుందని, అలాగే ఉద్యోగస్తులు విధులకు హాజరవుతున్నప్పుడు మస్టర్ సమయం కంటే ముందుగా బయలుదేరాలని, ఇంటి వద్ద నుంచి ప్రారంభమైనప్పటి నుండి భద్రత అవసరమని మోటార్ వాహనాలపై వచ్చినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కార్ నందు వస్తున్నప్పుడు తప్పక సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. విధిగా హెల్మెట్ ని ధరించి ప్రయాణించాలని సూచించారు. అలాగే అతివేగంగా కూడా ప్రయాణం చేయవద్దని తెలియజేశారు.

అలాగే ప్రతి ఒక్క ఉద్యోగి పని స్థలాలలో అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించిన పనిని ఎటువంటి యాక్సిడెంట్ జరగకుండా చేయాలని తెలియజేశారు. అలాగే ప్రస్తుత కాలంలో ఎంతోమంది చెడు వ్యసనాలతో వారి ఆరోగ్యాన్ని పాడు చేసుకొని అనారోగ్యాలతో చనిపోతున్నారని అలాగే ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకుండా ప్రతిరోజు వ్యాయామము తప్పక చేస్తూ ఉండాలని ప్రతి ఒక్క కార్మికుడు ఇంటి నుండి ఏ విధంగా అయితే క్షేమంగా విధులకు హాజరవుతున్నారో అదేవిధంగా ఇంటికి వెళ్లాలని తెలియజేస్తూ ఉత్పత్తితోపాటు రక్షణ కూడా ప్రతి ఉద్యోగికి అవసరమని, గుర్తుంచుకోవాలని ప్రమాదాన్ని గుర్తించి దాని నివారణకి తగు జాగ్రత్త వహించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు గారు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# నీటి దానం మహాదానం

- సంతాపూర్ గ్రామంలో చలివేంద్రం ప్రారంభోత్సవం
- భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు కర్రెడ్ల నరేందర్ రెడ్డి



**సి కే న్యూస్ షాద్ నగర్:ఏప్రిల్ 15:** షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట్ మండలం సంతాపూర్ గ్రామంలో మంగళవారం రోజు చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్రెడ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలంలో వడదెబ్బతో ఎంతోమంది చనిపోతుంటారు. వీలైనంతవరకు నీరు తాగుతూనే ఉండాలని వేసవి తాపానికి గురికాకుండా వీలైనంతగా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరడం జరిగింది. రహదారుల పై వెళుతుంటే సరి అయిన నీరు దొరకక ఇబ్బందులు పడుతుంటారని ఇందుగ్గాను నా వంతు సహాయంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అమ్రేష్ అంజయ్య, వెంకటేష్, వేణుగోపాల్ రెడ్డి రాజు. భద్రప్ప తదితరులు పాల్గొన్నవారు

# నేడే ఒడిశా లో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం.

- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి.
- గనిని లాంఛనంగా ప్రారంభించనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు.
- ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల అతి పెద్ద గని.
- గని జీవితకాలం 38 ఏళ్ళు. సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఏప్రిల్ 15,** సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ ను నేడు (ఏప్రిల్ 16వ తేదీ) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వర్చువల్ గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా పేర్కొన్నారు.

**తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...**

2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ,ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని క లిసి విజ్ఞప్తులు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఒడిశా రాష్ట్రం లో ప్రత్యేకంగా పర్యటించి ఒడిశా రాష్ట్ర ముఖ్య మంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

**నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు ...**

ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గని లో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది.

సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది. ? ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు.

తెలంగాణలో ప్రస్తుతం గల సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయకమైనదే అని భావిస్తున్నారు.

ఈ గనిలో మేలైన జీ – 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది.

ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి , బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు .? ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలోని జరపడ రైల్వేసైడింగ్ కు రవాణా చేసి ,అక్కడి నుండి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.

అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ? నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది.

# కార్యకర్తలకు అండగా ఉంటాం..

- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.
- కైకలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి పాల్గొన్న ఎంపీ మహేష్ కుమార్



**ఏలూరు జంగారెడ్డిగూడెం సీ కే న్యూస్ ప్రతినిధి,** కైకలూరు, ఏప్రిల్ 15: తెలుగుదేశం పార్టీకి వెన్నుముకలైన కార్యకర్తలకు అండగా ఉంటామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భరోసా ఇచ్చారు. కైకలూరులోని కళ్యాణ మండపంలో మంగళవారం రాత్రి జరిగిన నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం, సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం తెదేపా శ్రేణులు సభ్యత్వ నమోదులో ముందుండి అధిష్టానం వద్ద తమ పరపతి పెంచారని, సభ్యత్వ నమోదులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ఎంపీ మహేష్ కుమార్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిని నియమించాలనే కార్యకర్తల మనోభావాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ విజయంలో భాగస్వాములై , కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పదవుల విషయంలో అధిష్టానం తగి న్యాయం చేస్తుందని ఎంపీ తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే తన కార్యాలయం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఏలూరు పార్లమెంటును అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, ఇక్కడి సమస్యలను పార్లమెంట్లో ప్రస్తావించి నిధులు రాబట్టేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో పలు సమస్యలపై ప్రజల తరఫున లోక్ సభలో తన గళం వినిపించానని, అదే సమయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడానికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఎంపీ తెలిపారు. అలాగే కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యేలతో కలిసి తమవంతు ప్రయత్నం చేస్తున్నామని, కొంత జాప్యం జరిగిన, కొల్లేరు ప్రజలకు మాత్రం న్యాయం చేస్తామని ఎంపీ మహేష్ కుమార్ మరోసారి స్పష్టం చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు.

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, నియోజకవర్గ పరిశీలకులు మెంటే పార్థసారథి, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కొత్త నాగేంద్రబాబు, కొడాలి వినోద్, విజయలక్ష్మి, కే రమేష్, త్రినాధరావు, నాలుగు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏసీబీ అధికారులు వలలో బయో డైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్



**శేరిలింగంపల్లి సీ కే న్యూస్ ప్రతినిధి,** మరో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఈసారి జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేపట్టింది. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గత కొంతకాలంగా చాంద్రాయణ గుట్ట సర్కిల్ లో అర్బన్ బయోడైవర్సిటి విభాగం ఇంచార్జ్ గా వ్యవహరిస్తున్నారు.

చాంద్రాయణ గుట్ట సర్కిల్ పనికి సంబంధించి ఓ కాంట్రాక్టర్ వద్ద రూ. 70 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడిని లంచం డబ్బులు తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి రావాలని సూచించాడు. దీంతో కాంట్రాక్టర్ అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపిన విధంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని శ్రీనివాస్ వద్దకు వచ్చాడు. అతని వద్ద నుండి డబ్బులు తీసుకుంటూ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

## జిల్లా టాపర్ నిర్మలను ఘనంగా సన్మానించిన జాయింట్ కలెక్టర్ బి. నవ్య.

**ఎమ్మిగనూరు, సీ కే న్యూస్ ప్రతినిధి,ఏప్రిల్ 15,** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలలో కర్నూలు జిల్లా టాపర్‌గా నిలిచిన పెద్ద హరివనం గ్రామానికి చెందిన ఎస్. నిర్మలను మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య , ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ , రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, పాల్గొని, నిర్మలకు శాలువ కప్పి, పూలవేసి ఘనంగా సత్కరించారు. కేజీబీవీ కళాశాల, ఆస్పరి మండలం లో బైపీసీ విభాగంలో చదువుతున్న నిర్మల, మొదటి సంవత్సరం 421 మార్కులు, రెండో సంవత్సరం 966/1000 మార్కులు సాధించి, జిల్లాలో బైపీసీ విభాగంలో అత్యుత్తమ స్థాయిలో ప్రదర్శన చూపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని, నిర్మల వంటి విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలి, అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా మాట్లాడుతూ.. ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని వెల్లడించారు.



# 19వతేదీన ఏం జరగబోతోంది...

స్టీల్ సిటీలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైసీపీకి విశాఖలో మరో షాక్ తగిలింది. ఊహించినట్లుగానే ఆ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒక్కరొక్కరుగా చేజారిపోతున్నారు. తాజాగా వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశి జనసేన గూటికి చేరారు. మాజీ మంత్రి జనసేన నాయకుడు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. 74వ వార్డు కార్పొరేటర్ గా కొనసాగుతున్న వంశీ వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు.తిప్పలనాగిరెడ్డి తొలి నుంచి వార్డు అభివృద్ధిపై తమకు నిధులు కేటాయించడం లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారంట. నిధుల కేటాయింపు విషయమై వంశీ కౌన్సిల్ సమావేశాల్లో పలు సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐనా ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో చివరకు పార్టీ మారాలని నిర్ణయించుకొని జనసేనలో చేరిపోయారు. వంశీ జనసేనలో చేరడంతో గ్రేటర్ పీఠం కూటమి కైవసం చేసుకోబోతుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమయం దగ్గర పడుతుండడంతో నగరంలో పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. ఈనెల 19న అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. దీంతో కొద్దిరోజులుగా క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పీఠం దక్కించుకుంటామని టిడిపి బలంగా చెబుతోంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పదవిని నిలుపుకుంటామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. రెండు పార్టీలు క్యాంప్ రాజకీయాలకు తెరలేపాయి. కొంతమంది కార్పొరేటర్లను విదేశాలకు తరలించినట్లు జోరుగా ప్రచారం కూడా సాగుతోంది. అయితే మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి 74 మంది సభ్యుల అవసరంకాగా..ఇప్పటికే కూటమికి 70 మంది సభ్యులు సహకారం ఉంది.వీరితో పాటు మరో ఐదుగురు వైసీపీ సభ్యులు తమతో టచ్ లో ఉన్నారని పలు సందర్భాల్లో కూటమి నేతలు చెబుతున్నారంట. దీనికి తగ్గట్టుగానే వంశీ పార్టీ మారడంతో వైసీపీ వర్గాల్లో టెన్షన్ స్టార్ట్ అయిందట. దీంతో కార్పొరేటర్లు జారిపోకుండా శ్రీలంకలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అటు కూటమి సైతం మలేసియాలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. జనసేన సైతం కౌలాలంపూర్ లో స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేసిందట. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. 98 డివిజన్లు ఉన్న గ్రేటర్ విశాఖలో..58 డివిజన్లలో వైసీపీ విజయం సాధించింది. టిడిపి 29 స్థానాలకు పరిమితం అయింది. జనసేన మూడు చోట్ల గెలిచింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరారు. టీడీపీతో పాటు జనసేనలోకి అధిక సంఖ్యలో చేరడంతో కూటమి బలం పెరిగింది.దీనికి తోడు కూటమికి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ఉన్నారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా వారు సైతం ఓటింగ్ కు వచ్చే అవకాశం ఉంది. అయితే వైసీపీ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చాలామంది కార్పొరేటర్లు..ముఖం చాటేస్తున్నారంట. బహిరంగంగానే తాము కూటమికి మద్దతు తెలుపుతామని కొంతమంది చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 19న జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్ లో కూటమి నెగ్గడం ఖాయమనే చర్చ నడుస్తోంది. మరి 19న జరిగే అవిశ్వాస తీర్మానంతో విశాఖ నగర పొలిటికల్ సీన్ మారుతుందా లేదా? ఆ రోజు అసలేం జరుగుతుందో చూడాలి.

## భర్తే...యముడు...

## ఇంట్లో చెప్పకుండా రెండేళ్లు మేనేజ్

వారిద్దరి కులాలు వేరు.. మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. పెళ్లి జరిగి రెండేళ్లు అయ్యింది. ఈ విషయాన్ని భర్త తల్లిదండ్రులకు చెప్పకుండా మేనేజ్ చేశాడు. భార్య గర్భవతి అయ్యింది. రేపో మాపో పండంటి బిడ్డకు జన్మ ఇవ్వనుంది. అంతలో కట్టుకున్న భార్యని ఆ లోకం నుంచి పంపించేశాడు భర్త. సంచలన రేపిన ఈ ఘటన విశాఖ సిటీలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్, సిటీలోని ఓ ప్రాంతానికి చెందిన అనూషను ప్రేమించాడు. అనూష తల్లికి చూపు మందగించింది. నాలుగేళ్ల కిందట తండ్రి చనిపోయాడు. ఆ ఇంటికి ఆమె పెద్ద దిక్కు అయ్యింది. మూడేళ్లు కిందట జ్ఞానేశ్వర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరిద్దరు కులాలు వేరు వేర్వేరుజ్ఞానేశ్వర్ రెండు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నడుపుతున్నాడు. డబ్బులకు కొదవలేదు. పెళ్లి జరిగి మూడేళ్లు గడిచినా భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేయలేదు జ్ఞానేశ్వర్. పెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా సిటీలో ఉద్యోగం చేస్తున్నానని వారిని నమ్మించాడు. అత్తమామల వద్దకు వెళ్దామని భార్య ఎప్పుడు అడిగినా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునేవాడు.భార్య అనూష గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఎనిమిదో నెల. వచ్చేవారంలో ఆమెకి డెలివరీ డేట్ ఇచ్చారు డాక్టర్లు. ఇప్పుడున్న సమయంలో భార్య డెలివరీ అయితే తల్లిదండ్రులతో లేనిపోని సమస్యలు వస్తాయని భావించాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యని ఏదోవిధంగా చంపేయడమే బెటరని నిర్ణయానికి వచ్చాడు.భార్యను వదిలించుకునేందుకు రకరకాల స్కెచ్‌లు వేశాడు. తనకు క్యాన్సర్ వచ్చిందని ఒకసారి, విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకోవాలని భార్యను కన్విన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. అందుకు భార్య ససేమిరా చెప్పింది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.గర్భిణిగా ఉన్న అనూషకు నెలలు నిండాయి. సోమవారం ఆమెని ఆసుపత్రిలో చేరాల్సి ఉంది. అక్కడే తన స్కెచ్‌ని పక్కాగా అమలు చేశాడు జ్ఞానేశ్వర్. ఆసుపత్రికి తోడు తీసుకెళ్లేందుకు అమ్మమ్మను రెండు రోజుల కిందట ఇంటికి పిలిచాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలు కలిసి నిద్రపోయాడు. ఇదే సరైన సమయమని భావించాడు భర్త.సోమవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తెల్లారిపోయింది.. మనుమరాలు నుంచి కనీసం ఉలుకు పలుకు లేదు. దీంతో వాళ్ల అమ్మమ్మ కంగారుపడి జ్ఞానేశ్వర్‌ను పిలిచింది. పైకి ఏమీ తెలియనట్టు స్థానికులతో కలిసి భార్యను కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.దీనిపై స్థానికుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరింది. జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పీఎం పాలెం పోలీసులు. దీంతో అసలు విషయం బయటపడింది. ప్రేమ పేరుతో అనూషను నమ్మించి మోసం చేశానని తెలిపాడు. ఆమెని వదిలించుకునే ప్రయత్నంలో హత్య చేసినట్టు అంగీకరించాడు.

## ఏపీలో ఐదు చోట్ల రోప్ వేలు

ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే సీ ప్లేన్ తో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలను కలుపుతూ మార్గాన్ని ఏర్పాటు చేసింది. విజయవంతంగా సిప్లేన్లను నడుపుతోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రవ్యాప్తంగా రోప్ వేల నిర్మాణం పై ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎందుకు సంబంధించి నేషనల్ హైవే లాజిస్టిక్ అథారిటీతో ఒప్పందం చేసుకుంది రాష్ట్ర ప్రభుత్వం.రోప్ వేలు ఇప్పటికే విశాఖ నగరంలో అందుబాటులో ఉన్నాయి. నగరంలోని కైలాసగిరి వద్ద వీటిని ఏర్పాటు చేశారు. పర్యాటకులను సైతం ఆకట్టుకుంటున్నాయి. అయితే తాజాగా ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, నంద్యాల జిల్లాలోని అహోబిలం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. రూప్ వేలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొస్తోంది కూటమి ప్రభుత్వం.2014లో టిడిపిఅధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే ఈ ప్రాజెక్టుల కోసం ప్లాన్ చేసింది.

# ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ చేపట్టాలి... ఇంఛార్జ్ కలెక్టర్ డా. శ్రీజ.

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్క్రూటిని ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలి
- వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ సదస్సులకు కార్యాచరణ చేపట్టాలి
- రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, భూ భారతి పై అధికారులతో సమీక్ష చేసిన ఇంచార్జ్ కలెక్టర్




**సి కె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -15** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల లబ్ది అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ అమలుచేయాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం ఇంచార్జ్ కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, భూ భారతి లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు, ఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు లేదా యూనిట్ల ఏర్పాటుకు యువతకు సబ్సిడీతో 4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సి కార్పొరేషన్ ద్వారా 29091, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 14220, బీసీ కార్పొరేషన్ ద్వారా 41881, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 6658 దరఖాస్తులు, మొత్తంగా 91850 దరఖాస్తులు సోమవారం నాటికి అందినట్లు, అన్ని దరఖాస్తులు ఆన్లైన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయమై అర్హులై, ప్లాట్లు ఉన్న ఎల్1 జాబితాను ఎంపిడివో సంతకంతో తీసుకొని, ఆమోదం కొరకు ఇందిరమ్మ కమిటీ ముందు ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదం తర్వాత మండల ప్రత్యేక అధికారి ఆయా జాబితాను జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం కొరకు సమర్పించాలన్నారు. ఇంచార్జ్ మంత్రుల ఆమోదం తప్పనిసరి అని తెలిపారు.

వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగునీటికి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. నియోజకవర్గాల వారిగా కావాల్సిన పనుల విషయమై నివేదిక సమర్పించాలన్నారు. ఇంట్రా, గ్రిడ్ లకు 1 లేదా 2 బఫర్ లు పెట్టాలన్నారు. క్రొత్తగా కాలనీలు, హాబీటేషన్ లు ఏర్పడ్డ చోట పైప్ లైన్ పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వనరుల మరమ్మత్తులు, ప్రత్యామ్నాయ వనరులు, వనరులు లేనిచోట మున్నగు వాటికి ఖర్చు విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అత్యవసర త్రాగునీటి అవసరాల నిమిత్తం కలెక్టర్ వద్ద నిధుల మంజూరికి పనుల గుర్తింపు వెంటనే చేపట్టాలన్నారు.

భూ భారతి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. భూ భారతి అమలు విషయమై పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్ లో భూ భారతి చట్ట అమలుపై అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల విజయవంతానికి తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో లబ్ధిదారుల సమీకరణ, అవగాహన కల్పనకు పటిష్టమైన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎంపిడిఓ లు, ఎంపీవో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 17 న మహిళలకు జాబ్ మేళా నిర్వహణ .... జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

### డిగ్రీ అర్హత గల మహిళలు మాత్రమే జాబ్ మేళాకు హాజరు కావాలి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -15:** జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 17న గురువారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం గాంధీ చౌక్ లోని కోటక్ మహీంద్రా బ్యాంకు పైన ఉన్న రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30-45 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ పాసైన మహిళలు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 20 వేల నుండి 25 వేల వరకు ఉంటుందని, ఎంపికైన వారు ఖమ్మం జిల్లాలో పనిచేయవలసి ఉంటుందని అన్నారు. మొత్తం 20 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల పటిష్ట అమలుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారుల నియామకం..

ఉత్తర్వులు జారీచేసిన ఇంచార్జ్ కలెక్టర్ డా. శ్రీజ

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఏప్రిల్ -15** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా పటిష్ట పర్యవేక్షణకు నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఖమ్మం నియోజకవర్గానికి జెడ్పి సిఇఓ దీక్షా రైనా, పాలేరు కు ఎస్డీసి ఎం. రాజేశ్వరి, మధిర కు జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, వైరా కు డివిజనల్ పంచాయతీ అధికారి టి. రాంబాబు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఎల్. రాజేంద్ర గౌడ్ లు ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. దరఖాస్తుల సర్వే, వందశాతం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తారన్నారు. పథకాల గ్రౌండింగ్ కు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని, ఒక్క ఫిర్యాదు రాకుండా ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు.



# లిక్కర్ స్కాంలో రహస్యంగా విచారణ

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో కీలక నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి కోసం సిట్ బృందాలు గాలింపు ప్రారంభించాయి. హైదరాబాద్‌లో అరెటా హాస్పిటల్‌తో పాటు మరికొన్ని చోట్ల సిట్ బృందాలు సోదాలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి ఇల్లు, ఆఫీసుల్లోనూ సోదాలు చేస్తున్నారు. దాడుల్లో పాల్గొంటున్న సుమారు 10 నుంచి 15 సిట్ బృందాలు పాల్గొంటున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి లిక్కర్ స్కాంపై సిట్ విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఆయన ముందస్తు బెయిల్ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించినా విచారణకు హాజరు కావడం లేదు. ఏపీ మద్యం స్కాంలో సైలెంట్‌గా సీఐడీ సిట్ తన తాను పని చేసుకుపోతోంది. కీలక పాత్రధారులకు నోటీసులు జారీ చేస్తోంది. వారంతా కోర్టుకు వెళ్తున్నారు. కానీ హైకోర్టులో మాత్రం సానుకూల ఫలితం రావడం లేదు. ఏపీ లిక్కర్ స్కాంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ విజయసాయిరెడ్డి గతంలో ప్రకటించారు. రాజ్ కసిరెడ్డిపై సీఐడీ ఎప్పుడో దృష్టి పెట్టింది. నోటీసులు జారీ చేసింది. ఆయన నోటీసులను తాజాగా హైకోర్టులో సవాల్ చేశారు. తనపై దూకుడైన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసి ఆయన పిటిషన్ డిస్మిస్ చేసింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి జగన్ ఐటీ సలహాదారుగా నియమించారు. ఏపీ లిక్కర్ స్కాంపై సీఐడీ చాలా లోతుగా దర్యాప్తు చేసింది. చాలా విషయాలు వెలుగులోకి తెచ్చిందని చెబుతున్నారు. ఏపీబీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మొత్తం వ్యవహారాలపై రోజుల తరబడి స్టేట్ మెంట్ ఇచ్చారు. న్యాయమూర్తి ముందు కూడా వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ స్కాంలో కీలకంగా ఉన్న వారి గుట్టు అంతా బయటపడుతోందని చెబుతున్నర్నా. ఇప్పటికే మిథున్ రెడ్డికి ఈ స్కాంలో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఆయన సుప్రీంకోర్టు నుంచి రిలీఫ్ తెచ్చుకున్నారు. వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి . వైసీపీ గెలవగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యనిషేధం పేరిట దుకాణాలు తగ్గిస్తామని చెప్పి ఈ నిర్ణయం తీసుకున్నారు. అనూహ్యంగా బయట దొరికే బ్రాండ్ల మద్యం మొత్తం ఏపీలో బ్యాన్ చేశారు. కేవలం కొన్ని కంపెనీలు.. అది కూడా ఏపీ లోనే మద్యం అమ్మే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. అవన్నీ వైసీపీ నేతలవన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిపై దర్యాప్తు ప్రారంభించింది. ఈడీ కూడా విచారణ చేయాలని సిఫారసు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించి హైదరాబాద్ లో ఏపీ సిట్ బృందాలు సోదాలు జరుపుతున్నాయి. రాజ్ కసిరెడ్డి కోసం హైదరాబాద్ లో గాలిస్తున్నాయి. రాయదుర్గం పోలీసుల సాయంతో అరెటా ఆసుపత్రిలో ఏపీ సిట్ బృందాలు సోదాలు చేశాయి. రాజ్ కసిరెడ్డి కుటుంబసభ్యులు అరెటా ఆసుపత్రిలో డైరెక్టర్లుగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కసిరెడ్డి హైదరాబాద్ లో తలదాచుకున్నట్లు సిట్ అనుమానిస్తోంది.ఏపీ లిక్కర్ స్కామ్ లో రాజ్ కసిరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు గుర్తించాయి.



# బుట్ట బొమ్మ మరీ అంత చీప్ అయ్యిందా..?



బుట్ట బొమ్మ పూజా హెగ్డే రెండేళ్ల క్రితం వరకు టాలీవుడ్ లో టాప్ ప్లేస్ లో ఉండగా వరుస సినిమాలు నిరాశపరచడంతో అమ్మడికి అవకాశాలు రాలేదు. హారిక హాసిని వారి గుంటూరు కారం సినిమా వచ్చినట్టే వచ్చి మిస్ అయ్యింది. అప్పటి నుంచి టాలీవుడ్ లో పూజా హెగ్డే సినిమా అంటూ రాలేదు. బాలీవుడ్ లో కూడా అమ్మడికి పెద్ద ఆశించిన జోష్ కనిపించట్లేదు. ఐతే ఉన్నంతలో పూజా హెగ్డేకి కోలీవుడ్ లో ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు తమిళ్ లో రెండు క్రేజీ ప్రాజెక్టులు చేస్తుంది. అందులో ఒకటి సూర్య రెట్రో సినిమా కాగా మరొకటి దళపతి విజయ్ జన నాయగన్. రెట్రో సినిమా కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్ లో వస్తుంది. ఈ సినిమా మే 1న రిలీజ్ లాక్ చేశారు. రెట్రో నుంచి ఈమధ్యనే వచ్చిన సాంగ్ తో పూజా హెగ్దే సందడి మొదలైంది. ఐతే కెరీర్ కాస్త అటు ఇటుగా ఉన్న టైం లో కోలీవుడ్ నుంచి వచ్చిన ఛాన్స్ కాబట్టి పూజా బేబీ రెమ్యునరేషన్ విషయంలో పట్టింపులు లేనట్టుగా ఉందని తెలుస్తుంది. సౌత్ లో ముఖ్యంగా టాలీవుడ్ లో టాప్ ప్లేస్ లో ఉన్న టైం లో మంచి రెమ్యునరేషన్ అందుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం ఆఫర్లు వస్తే చాలు పారితోషికం సంగతి తర్వాత అన్నట్టుగా ఉంటుందట. రెట్రో సినిమాకు మామూలుగా ఆమె తీసుకునే రెమ్యూనరేషన్ కన్నా చాలా తక్కువ తీసుకుందని చెబుతున్నారు. ఐతే రెట్రో సినిమాతో పూజా సౌత్ లో సూపర్ కంబ్యాక్ అవ్వాలని చూస్తుంది. రెట్రోలో పూజా పాత్రకు కూడా మంచి వెయిట్ ఉంటుందని టాక్. అంతకుముందు పూజా అంటే కేవలం గ్లామర్ షో కోసమే అన్న టాక్ ఉండేది కానీ రెట్రో సినిమాలో మాత్రం అమ్మడి క్యారెక్టర్ నెక్స్ట్ లెవెల్ అని టాక్. ఇక ఈ సినిమా తర్వాత విజయ్ జన నాయగన్ లో కూడా పూజా సర్ ప్రైజ్ చేస్తుంది. ఐతే ఆ సినిమా రిలీజ్ కు చాలా టైం ఉంది కాబట్టి ఈలోగానే మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది. కోలీవుడ్ సరే కానీ పూజా బేబీకి తెలుగులో మరో ఛాన్స్ ఎప్పుడంటూ ఆమె ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఒకటి రెండు సినిమాల్లో పూజా హెగ్దే ని తీసుకుంటున్నారన్న డిస్కషనే తప్ప ఏది ఫైనల్ అవ్వట్లేదు.



రిత్తికా చక్రవర్తి తెల్ల గులాబీ మరియు అనంతలో అప్రయత్నంగా ఆకర్షణతో మెరిసింది

## నితిన్ సినిమాలకు బడ్జెట్ సమస్య?

జయం, దిల్, సై లాంటి వరుస హిట్లతో ఘనంగా కెరీర్ ఆరంభమయ్యాక.. నితిన్ వరుస ఫ్లాపులతో ఎలా సతమతం అయ్యాడో తెలిసిందే. 'ఇష్క్' సినిమాతో మళ్లీ గాడిన పడే వరకు పేలవమైన దశను అనుభవించాడతను. 'ఇష్క్' తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అప్పుడప్పుడూ కొన్ని ఎదురు దెబ్బలు తగిలినా.. కెరీర్ నాట్ బ్యాడ్ అన్నట్లే సాగుతూ వచ్చింది. గుండె జారి గల్లంతయ్యిందే, అఆ, భీష్మ లాంటి మంచి హిట్లు పడ్డాయి. మధ్య మధ్యలో కొన్ని సినిమాలు తేడా కొట్టినా నితిన్ బాగానే నిలదొక్కుకున్నట్లే కనిపించాడు. / %ూశ్రీంశీ =ఘుం% - చెన్నై బ్యూటీ నాట్ ఇంట్రెస్టెడ్..! కానీ ఈ మధ్య మళ్లీ నితిన్ వరుస ఫెయిల్యూర్లు చూస్తున్నాడు. చెక్, రంగ్ దె, మాచర్ల నియోజకవర్గం, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్.. ఇలా వరుసగా నాలుగు ఫెయిల్యూర్లు ఎదుర్కొన్నాడు. ఈ స్థితిలో తన ఆశలన్నీ 'రాబిన్ హుడ్' మీదే నిలిచాయి. కానీ ఈ సినిమా కూడా నిలబడలేదు. నితిన్ ఖాతాలో మరో డిజాస్టర్ జమ అయింది. ఇప్పటిదాకా ఫెయిల్యూర్లు వస్తున్నా నితిన్ మీద నమ్మకంతో నిర్మాతలు బాగానే ఖర్చు పెడుతూ వచ్చారు. మైత్రీ వాళ్లయితే 'రాబిన్ హుడ్' మీద ఏకంగా రూ.70 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టేశారు. కానీ ఈ చిత్రం దారుణమైన నష్టాలను మిగిల్చింది. నితిన్ మార్కెట్ మీద తీవ్ర ప్రభావం చూపింది. దీంతో తర్వాతి చిత్రాల బడ్జెట్లను నిర్మాతలు సరి చూసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆల్రెడీ దిల్ రాజు.. 'తమ్ముడు' మీద కొంచెం ఎక్కువ బడ్జెటే పెట్టాడు. 'రాబిన్ హుడ్' ఎఫెక్ట్‌తో అందుకు తగ్గట్లుగా బిజినెస్ జరగడం కష్టంగా మారింది. దీంతో నితిన్‌తోనే తర్వాత తీయాల్సిన 'యల్లమ్మ' సినిమాకు బడ్జెట్ విషయంలో తర్జన భర్జనలు నడుస్తున్నట్లు సమాచారం. షెడ్యూళ్లు, ఖర్చును రివైజ్ చేస్తున్నారట. ఇంకోవైపు విక్రమ్ కుమార్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్‌లో నితిన్ ఓ భారీ బడ్జెట్ సినిమా చేయాల్సి ఉంది. అది పెద్ద స్పాన్ ఉన్న సినిమా. ఐతే ఆల్రెడీ 'విశ్వంభర'తో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న యువి వాళ్లు.. నితిన్ సినిమా విషయంలో పెద్ద రిస్క్ చేసే స్థితిలో లేరు. దీంతో ఆ సినిమా అసలు ముందుకు కదులుతుందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి 'రాబిన్ హుడ్' డిజాస్టర్ కావడంతో నితిన్ ఫ్యూచర్ ప్రాజెక్టుల మీద బాగానే ప్రభావం చూపేలా కనిపిస్తోంది.

